# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 27 | పేజీలు: 5 | వెల: రూ.4/- | సోమవారం 15 సెప్టెంబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## ఈశాన్య భారతంలో భూకంపం

**గువాహటి, సెప్టెంబర్ 14 (నమస్తే ఉదయం)**

ఈశాన్య భారతం, పశ్చిమ బెంగాల్‌లలో ఆదివారం భూకంపం సంభవించింది. దీని తీవ్రత భూకంప లేఖినిపై 5.8గా నమోదైంది. ఆదివారం మధ్యాహ్నం 4.41 గంటలకు మొదటిసారి భూమి కంపించింది. ఆ తర్వాత గంటన్నర సమయంలో మూడుసార్లు చిన్న ప్రకంపనలు వచ్చాయి. అస్సాంలో భూకంపం వల్ల ఇద్దరు గాయపడగా, కొన్ని ఇండ్లు దెబ్బతిన్నాయి. మణిపూర్ పశ్చిమ ప్రాంతాలు, అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఈటా నగర్‌లలో కూడా భూమి కంపించింది. అస్సాం సరిహద్దుల్లోని పశ్చిమ బెంగాల్ ప్రాంతాలపై కూడా ఈ ప్రభావం కనిపించింది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేసి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహాయపడతామని చెప్పారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సీఎం రేవంత్
# ప్రత్యేక సమావేశం

- స్వయంగా రంగంలోకి దిగిన సీఎం రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నేతలకు ఆదేశం
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచన
- అభ్యర్థి ఎంపికను ఏఐసీసీ చూసుకుంటుందని స్పష్టం చేసిన సీఎం
- బూత్ స్థాయిలో సమన్వయంతో పనిచేయాలని నేతలకు దిశానిర్దేశం
- సమావేశంలో పాల్గొన్న మంత్రులు, పీసీసీ చీఫ్, ముఖ్య నేతలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే ఉదయం)**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి త్వరలో జరగనున్న ఉప ఎన్నికను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి, పార్టీ గెలుపు వ్యూహాలపై దృష్టి సారించారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం అనుసరించాల్సిన ప్రణాళికలపై ఆయన పార్టీ ముఖ్య నేతలతో నేడు కీలక సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల ఇన్‌ఛార్జులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకూ చేర్చాలని, బూత్ స్థాయి నుంచి పటిష్ఠంగా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం ..మిగతా 2లో



## ఉగ్రవాదులకు కాంగ్రెస్ మద్దతు

- అసోం పర్యటనలో కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రధాని
- భారతరత్న భూపేన్ హజారికాను కాంగ్రెస్ అవమానించిందని ఆరోపణ
- దర్రాంగ్ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన
- మెడికల్ కాలేజీ, రింగ్ రోడ్డు, వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం
- నుమాలిగఢ్‌లో బయో-ఇథనాల్ ప్లాంట్‌ను ప్రారంభించనున్న మోదీ

**దరంగ్, సెప్టెంబర్ 14 (నమస్తే ఉదయం)**

అస్సాంలో పర్యటిస్తున్న ప్రధాని మోడీ ఆదివారం దరంగ్ జిల్లాలోని మంగళ్‌డోయ్‌లో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ భారత సైన్యానికి కాదు, పాకిస్థాన్ పెంచి పోషించిన ఉగ్రవాదులకు, జాతి వ్యతిరేక శక్తులకు మద్దతు ఇస్తుంది" అని ..మిగతా 2లో

## టీ నుంచి డిన్నర్ వరకు ప్రతి దాంట్లో
# జీఎస్టీ ప్రయోజనం

- ప్రజల దైనందిన జీవితంలో జీఎస్టీ భాగమైందన్న నిర్మలా సీతారామన్
- 12 శ్లాబులోని 99 శాతం వస్తువులు ఇప్పుడు 5 పరిధిలోకి
- పారదర్శక విధానాలతో 1.5 కోట్లకు పెరిగిన పన్ను చెల్లింపుదారులు
- రూ. 22.08 లక్షల కోట్లకు చేరిన జీఎస్టీ వసూళ్లు
- రాష్ట్ర మంత్రుల భాగస్వామ్యంతోనే జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 (నమస్తే ఉదయం)**

ప్రజల దైనందిన జీవితంలోని ప్రతి అంశంలోనూ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆదివారం చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఉదయం తాగే టీ నుంచి రాత్రి తినే భోజనం వరకు ప్రతి వస్తువుపై జీఎస్టీ సంస్కరణల సానుకూల ఫలితాలు ప్రజలకు అందుతున్నాయని వివరించారు. ఈ సంస్కరణల వల్ల సామాన్యులకు ఎంతో మేలు జరుగుతోందని ఆమె స్పష్టం ..మిగతా 2లో

## ఎస్ఎల్‌బీసీ ఘటన: 200 రోజులు గడిచినా
# మృతదేహాలు వెలికితీయరా?

### రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే ఉదయం)**





శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం కూలిన ఘటన జరిగి 200 రోజులు దాటినా ఆరుగురు కార్మికుల మృతదేహాలను వెలికితీయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ సర్కారు నేరపూరిత నిర్లక్ష్యం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఆయన ప్రభుత్వ తీరును తప్పుబట్టారు.

"అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం 200 రోజులు గడిచినా ఆరుగురు బాధితుల మృతదేహాలను కూడా వెలికితీయలేకపోయింది. వారి కుటుంబాలకు ఇంతవరకు ఎలాంటి నష్టపరిహారం అందించలేదు" అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపైనా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. "కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్న సమస్యలకే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందాన్ని పంపి హడావుడి చేసిన బీజేపీ.. ఎస్ఎల్‌బీసీ ఘటనపై ఎందుకు స్పందించడం లేదు? ఎందుకు ఎలాంటి దర్యాప్తు బృందాన్ని పంపలేదు? తెలంగాణలో కాంగ్రెస్ (ఛోటే భాయ్) ను బీజేపీ (బడే భాయ్) ఎందుకు కాపాడుతోంది? వీరి మధ్య ఉన్న ఈ అపవిత్ర బంధం ఏమిటి?" అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బాధితులకు న్యాయం చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. "మేం అధికారంలోకి వచ్చిన రోజున ఆ ఆరు కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తాం. ఆరుగురు కార్మికులను సజీవ సమాధి చేసిన వారు తగిన మూల్యం చెల్లించుకునేలా చేస్తాం. కాంగ్రెస్ నాశనం చేసిన ప్రతిదానికీ సమాధానాలు రాబడతాం" అని స్పష్టం చేశారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఎస్ఎల్‌బీసీ సొరంగం పైకప్పులోని కొంత భాగం కూలిపోవడంతో 8 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగినప్పుడు టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) సహాయంతో దాదాపు 50 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రమాదం జరిగిన 14 కిలోమీటర్ల లోపల ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. గాలింపు చర్యల అనంతరం పంజాబ్‌కు చెందిన టీబీఎం ఆపరేటర్ గుర్ ప్రీత్ సింగ్ మృతదేహాన్ని మార్చి 9న, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రాజెక్ట్ మేనేజర్ మనోజ్ కుమార్ మృతదేహాన్ని మార్చి 25న వెలికితీశారు. కాగా, శ్రీనివాస్ (ఉత్తర ప్రదేశ్) , సన్నీ సింగ్ (జమ్మూ కాశ్మీర్) సహా జారండ్‌కు చెందిన సందీప్ సాహు, జెగ్తా జెస్, సంతోష్ సాహు, అనూజ్ సాహు మృతదేహాలు ఇంకా లభ్యం కాలేదు.

# మరో మూడు రోజులు.. వర్షాలే వర్షాలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే ఉదయం)**

తెలంగాణలో గత రెండు రోజులుగా పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నాయి. అయితే ఇప్పట్లో వర్షాలు తగ్గేలా లేవు. ఎందుకంటే ఇంకా మరో మూడు రోజులు వర్షాలు పడతాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. సెప్టెంబర్ 14 ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ.. మిగతా జిల్లాల్లో తేలిక పాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. సెప్టెంబర్ 15 ఆరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సెప్టెంబర్ 16న పలు జిల్లాల్లో మోస్తారు వర్షాలు పడతాయని తెలిపింది. ఆదిలాబాద్, యాదాద్రి భువనగిరి జిలాల్లో మోస్తారు వర్షాలకు ఛాన్స్ ఉన్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అదే విధంగా హైదరాబాద్ లో కొన్ని ప్రాంతాల్లో వానలు కురుస్తాయని తెలిపారు. ఇటు భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల, జనగాం, ఖమ్మం, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి, మహబూబా బాద్, మంచిర్యాల, ములుగు, నల్గొండ, నిర్మల్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్ జిల్లాల్లో సాయంత్రం వరకు తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలకు ఛాన్స్ ఉందని.. రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# ఉగ్రవాదులకు కాంగ్రెస్ మద్దతు

మొదటి పేజీ తరువాయి...

అన్నారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా అస్సాంను పాలించిందని, కానీ బ్రహ్మపుత్ర నదిపై "కేవలం మూడు వంతెనలు" మాత్రమే నిర్మించిందని విమర్శించారు. అదే బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం గత 10 ఏళ్లలో అలాంటి ఆరు నిర్మాణాలను నిర్మించిందని ప్రధాని పేర్కొన్నారు. ఆ పాత పార్టీ చొరబాటుదారులను, దేశ వ్యతిరేక శక్తులను రక్షిస్తోందని అన్నారు. చొరబాటుదారులు భారత్ భూమిని ఆక్రమించుకోవడానికి, జనాభాను మార్చడానికి చేసే కుట్రలను బీజేపీ అనుమతించదని ప్రధాని స్పష్టం చేశారు.

'కాంగ్రెస్ పార్టీ 'ఆపరేషన్ సింధూర్' సమయంలో, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేసిన దేశ సాయుధ దళాలకు మద్దతు ఇవ్వడానికి బదులుగా, చొరబాటుదారులను, దేశ వ్యతిరేక శక్తులను రక్షించడంలో నిమగ్నమై ఉంది' అని ప్రధాని విమర్శించారు. కామాఖ్య మాత ఆశీస్సుల వల్ల 'ఆపరేషన్ సింధూరం' విజయవంతమైందని, ఈ పవిత్ర భూమిపై ఉండటం గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు.

నెహ్రూ చేసిన గాయాలు మానలేదు..



"1962లో చైనా దురాక్రమణ సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ అస్సాం ప్రజలపై చేసిన గాయాలు ఇంకా మానలేదు" అని ప్రధాని పేర్కొన్నారు. ఆక్రమిత భూమి నుంచి చొరబాటుదారులను తరిమికొట్టి, రైతులు ఇప్పుడు ఈ భూములలో సాగు చేసుకునేలా చేసిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మను ప్రధాని ప్రశంసించారు. భారతరత్న అవార్డు గ్రహీత భూపేన్ హజారికాను కాంగ్రెస్ అవమానించినందుకు బాధపడినట్లు ప్రధాని పేర్కొన్నారు. వారి కలలను సాకారం చేయడానికి బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కట్టుబడి ఉంది స్పష్టం చేశారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారతదేశం ఎదుగుతోందని, అస్సాం వృద్ధి రేటు 13 శాతంగా ఉందని అన్నారు.

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం అస్సాంను ఆరోగ్య కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నాయి అన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాని మంగళ్‌డోయ్‌లో రూ.6,300 కోట్ల విలువైన ఆరోగ్య, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అలాగే దరంగ్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణాన్ని, నర్సింగ్ కాలేజీ, +చీవీ స్కూల్ భవనాలను ప్రారంభించారు. అనంతరం 1,200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 2.9 కి.మీ. పొడవైన నరేంగి-కురువా వంతెనకు, అస్సాంలోని కామరూప్, దరంగ్ జిల్లాలను, మేఘాలయలోని రి భోయ్‌ను కలిపే 118.5 కి.మీ. పొడవైన గౌహతి రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సీఎం రేవంత్ ప్రత్యేక సమావేశం

మొదటి పేజీ తరువాయి...

చేశారు. "నియోజకవర్గంలోని సమస్యలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందనే భరోసాను ప్రజలకు కల్పించాలి. అభ్యర్థి ఎవరనేది ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నిర్ణయిస్తుంది. కానీ, అభ్యర్థి ఎవరైనా పార్టీని గెలిపించే బాధ్యత మీ అందరిపై ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని కూడా ఆయన సూచించారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా సమీక్ష నిర్వహించడంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.



## లండన్‌లో 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' పురస్కారం అందుకున్న దేవాన్ష్

**మంత్రి నారా లోకేశ్ పుత్రోత్సాహం...**

**చదరంగంలో దూసుకుపోతున్న నారా దేవాన్ష్**

**'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా ప్రపంచ రికార్డుకు అరుదైన గుర్తింపు**

**కుమారుడి అవార్డు ప్రదానోత్సవానికి హాజరైన మంత్రి నారా లోకేశ్**

**దేవాన్ష్ ఘనత చూసి గర్వపడుతున్నానని లోకేశ్ వెల్లడి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే ఉదయం)**

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తనయుడు నారా దేవాన్ష్ (10) అంతర్జాతీయ వేదికపై అరుదైన ఘనత సాధించాడు. చదరంగంలో అద్భుత ప్రతిభ కనబరిచి నెలకొల్పిన ప్రపంచ రికార్డుకు గాను, లండన్‌లోని చారిత్రాత్మక వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ కార్యక్రమానికి మంత్రి నారా లోకేశ్ స్వయంగా హాజరై, కుమారుడి విజయాన్ని చూసి మురిసిపోయారు. వివరాల్లోకి వెళితే, గత ఏడాది జరిగిన 'చెక్ మేట్ మారథాన్' పోటీలో దేవాన్ష్ అసాధారణ ప్రతిభ కనబరిచాడు. ప్రఖ్యాత చెస్ గ్రాండ్‌మాస్టర్ లాస్లో పోల్గార్ రచించిన "5334 ప్రాబ్లమ్స్, కాంబినేషన్స్, అండ్ గేమ్స్" పుస్తకం నుంచి తీసుకున్న 175 క్లిష్టమైన చెక్‌మేట్ పజిల్స్‌ను అత్యంత వేగంగా పరిష్కరించి 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా ప్రపంచ రికార్డు సృష్టించాడు. సులభం నుంచి అత్యంత కఠినంగా మారే ఈ పజిల్స్‌ను పరిమిత సమయంలో పరిష్కరించడం ద్వారా దేవాన్ష్ తన వేగాన్ని, మేధాశక్తిని ప్రపంచానికి చాటాడు. ఈ అద్భుతమైన రికార్డును గుర్తించిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ, తాజాగా దేవాన్ష్‌ను పురస్కారంతో సత్కరించింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "ఈ రోజు వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో దేవాన్ష్ ఈ గౌరవాన్ని అందుకోవడం నిజంగా చాలా ప్రత్యేకమైన సందర్భం. పదేళ్ల వయసులోనే ముందుచూపుతో ఆలోచించడం, ఒత్తిడిలో ప్రశాంతంగా ఉండటం, ఆట పట్ల పూర్తి అంకితభావంతో ఉండటం అతని విజయాన్ని మరింత ప్రత్యేకం చేశాయి. ఒక తండ్రిగా, అతను గంటల తరబడి చేసిన సాధనను నేను కళ్లారా చూశాను. అతని కష్టానికి దక్కిన నిజమైన ప్రతిఫలం ఈ గుర్తింపు. మేమందరం అతని గురించి చాలా గర్వపడుతున్నాం" అని తెలిపారు. తల్లిదండ్రులు నారా బ్రాహ్మణి, నారా లోకేశ్ ల ప్రోత్సాహం, కోచ్ కె. రాజశేఖర్ రెడ్డి మార్గదర్శకత్వంలో దేవాన్ష్ నెలల తరబడి ఏకాగ్రతతో సాధన చేసి ఈ ఘనతను సాధించాడు. ఈ రికార్డుతో పాటు, గతంలో మరో రెండు ప్రపంచ రికార్డులను కూడా దేవాన్ష్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఏడు డిస్క్‌ల 'టవర్ ఆఫ్ హనోయి' పజిల్‌ను కేవలం 1 నిమిషం 43 సెకన్లలో పూర్తి చేయడం, అలాగే 9 చెస్ బోర్డులను 32 పావులతో కేవలం 5 నిమిషాల్లో సరిగ్గా అమర్చడం ద్వారా కూడా రికార్డులు నెలకొల్పాడు. దేవాన్ష్ విజయం అతని కుటుంబానికే కాకుండా, ప్రపంచ చెస్ రంగంలో ఎదుగుతున్న భారత కీర్తికి నిదర్శనంగా నిలిచింది.



## గ్రూప్-1 పోస్టులపై ఆరోపణలు.. కేటీఆర్‌పై రూ. 100 కోట్లకు దావా!

**కేటీఆర్‌పై పోలీసులకు కాంగ్రెస్ నేత ఫిర్యాదు**

**గ్రూప్-1 పోస్టులు అమ్ముకుంటున్నారని నిరాధార ఆరోపణలు చేశారన్న దయాకర్**

**ప్రభుత్వం పరువు తీసేలా కేటీఆర్ వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం**

**24 గంటల్లో క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత డిమాండ్**

**లేదంటే రూ.100 కోట్ల పరువు నష్టం దావా తప్పదని హెచ్చరిక**

**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే ఉదయం)**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. గ్రూప్-1 పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేసిన ఆయన 24 గంటల్లోగా క్షమాపణ చెప్పాలని, లేదంటే రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం దయాకర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న గ్రూప్-1 నియామకాలపై కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఒక్కో గ్రూప్-1 పోస్టును రూ.3 కోట్లకు అమ్ముకుంటున్నారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ పరువుకు నష్టం కలిగించేలా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం సరికాదని అన్నారు. కేటీఆర్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ప్రభుత్వానికి క్షమాపణ చెప్పాలని దయాకర్ డిమాండ్ చేశారు. ఇచ్చిన గడువులోగా ఆయన స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలతో నిరుద్యోగ యువతలో అనవసర ఆందోళన, అపోహలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.



## టీ నుంచి డిన్నర్ వరకు ప్రతి దాంట్లో జీఎస్టీ ప్రయోజనం

మొదటి పేజీ తరువాయి...

చేశారు. గతంలో 12 శాతం పన్ను శ్లాబులో ఉన్న 99 శాతం వస్తువులను ఇప్పుడు 5 శాతం పరిధిలోకి తీసుకువచ్చినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ నిర్ణయం వల్ల అనేక నిత్యావసర వస్తువులు మరింత చౌకగా లభిస్తున్నాయని, తద్వారా సామాన్య ప్రజలకు ప్రత్యక్షంగా ఉపశమనం కలుగుతోందని అన్నారు. ఇన్‌పుట్ ఖర్చులు తగ్గడంతో ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి, అంతిమంగా వినియోగదారులకు ధరల భారం తగ్గుతుందని ఆమె విశ్లేషించారు.

ప్రభుత్వం తీసుకొచ్చిన పారదర్శక, సులభతరమైన పన్నుల విధానాల వల్లే గత ఎనిమిదేళ్లలో పన్ను పరిధిలోకి వచ్చే వ్యాపారాల సంఖ్య 66 లక్షల నుంచి 1.5 కోట్లకు పెరిగిందని ఆమె గణాంకాలతో సహా వివరించారు. పన్ను వర్గీకరణలను మరింత స్పష్టంగా, సులభంగా మార్చడం వల్ల వ్యాపారులకు ఎలాంటి గందరగోళం లేకుండా పోయిందని, ఈ సౌలభ్యం తయారీదారులు, పంపిణీదారులు సైతం పన్ను వ్యవస్థలో చేరేందుకు ప్రోత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

2018లో రూ. 7.18 లక్షల కోట్లుగా ఉన్న స్థూల జీఎస్టీ వసూళ్లు, ఇప్పుడు రూ. 22.08 లక్షల కోట్లకు పెరిగాయని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ పెరుగుదల ప్రజలతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ప్రయోజనం చేకూరుస్తోందన్నారు. తనపై కొందరు విమర్శలు చేస్తూ, ప్రజలను ఇబ్బంది పెట్టడమే తన పని అని అంటున్నారని, కానీ తాము దేశం కోసం పనిచేస్తున్నామని ఆమె అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ ప్రారంభం నుంచి రాష్ట్రాల ఆర్థిక మంత్రులు భాగస్వాములుగా ఉన్నారని, అన్ని నిర్ణయాలు సమష్టిగానే తీసుకున్నామని ఆమె స్పష్టం చేశారు.

# ఒంటరి పోరుకు ఆర్‌జేడీ సై

**కూటమిలో కుదుపు: 243 స్థానాల్లోనూ ఆర్‌జేడీ పోటీ..**

**తేజస్వి సంచలన ప్రకటన**

**బీహార్ రాజకీయాల్లో కీలక మలుపు**

**తన ముఖం చూసి ఓటు వేయాలని తేజస్వి పిలుపు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 (నమస్తే ఉదయం)**

బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) నేత తేజస్వి యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేసి రాజకీయ వేడిని రాజేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాల్లోనూ తమ పార్టీయే పోటీ చేస్తుందని ప్రకటించి మహాఘట్‌బంధన్ కూటమిలో ప్రకంపనలు సృష్టించారు. సీట్ల పంపకాలపై మిత్రపక్షాలతో చర్చలు జరగాల్సి ఉండగా, తేజస్వి చేసిన ఈ ఏకపక్ష ప్రకటన కూటమి భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేసింది. ముజఫర్‌పూర్‌లోని కాంతిలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తేజస్వి, ఈసారి ప్రజలు తన ముఖం చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ ఆయన, కేవలం నినాదాలతోనే ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. "బీహార్ నుంచి ఓట్లు, గుజరాత్‌లో ఫ్యాక్టరీలు.. ఈ ఎత్తుగడలు ఇకపై చెల్లవు" అని వ్యాఖ్యానించారు. తమ ఒత్తిడి వల్లే



ప్రభుత్వం పెన్షన్, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తోందని, తాము ముందుంటే ప్రభుత్వం తమను అనుసరిస్తోందని అన్నారు. ఆర్‌జేడీ అధికారంలోకి వస్తే ఉపాధి, అభివృద్ధికి పెద్దపీట వేస్తామని తేజస్వి హామీ ఇచ్చారు. తమ పార్టీ ప్రకటించిన 'మై బెహన్ యోజన'ను కాపీ కొట్టి ప్రభుత్వం మహిళలకు రూ.10,000 ఇస్తోందని, కానీ తాము గెలిస్తే ఐదేళ్లలో ప్రతి మహిళకు లక్షన్నర రూపాయలు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేసిన తేజస్వి, రూ.80 వేల కోట్లకు లెక్కలు చెప్పడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో వంతెనలు కూలిపోతున్నాయని, ఆసుపత్రుల్లో రోగులకు భద్రత కరువైందని, అయినా ప్రభుత్వం అవినీతిపరులను వదిలేసి ఎలుకలకు రక్షణ కల్పిస్తోందని ఎద్దేవా చేశారు. 2020 ఎన్నికల్లో ఆర్‌జేడీ 144 స్థానాల్లో పోటీ చేసి 75 గెలవగా, కాంగ్రెస్ 70 స్థానాల్లో పోటీకి దిగి కేవలం 19 సీట్లకే పరిమితమైంది. ఈసారి జేఎంఎం, ఎల్జేపీ వంటి పార్టీలు కూడా కూటమిలో చేరాయి. ఈ నేపథ్యంలో సీట్ల సర్దుబాటు కీలకంగా మారిన సమయంలో, అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తామన్న తేజస్వి ప్రకటన మిత్రపక్షాలను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది.

# యుద్ధాలు మా పని కాదు..

**ట్రంప్‌కు గట్టిగా బదులిచ్చిన చైనా**

**యుద్ధాలను ప్రోత్సహించడం తమ విధానం కాదన్న వాంగ్ యీ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 (నమస్తే ఉదయం)**

తమ దేశంపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనపై చైనా తీవ్రంగా స్పందించింది. యుద్ధాలు, ఆంక్షల ద్వారా సమస్యలను పరిష్కరించలేమని, అవి పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తాయని గట్టిగా బదులిచ్చింది. వివాదాస్పద అంశాల పరిష్కారానికి శాంతియుత చర్చలకే తాము కట్టుబడి ఉన్నామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పష్టం చేశారు. శనివారం స్లోవేనియా పర్యటనలో భాగంగా ఆ దేశ ఉప ప్రధాని తాన్యా ఫజోన్‌తో సమావేశం అనంతరం వాంగ్ యీ విలేకరులతో మాట్లాడారు. "చైనా ఎప్పుడూ యుద్ధాలలో పాల్గొనదు, వాటిని ప్రోత్సహించదు. చర్చల ద్వారా రాజకీయ పరిష్కారాలను ప్రోత్సహించడమే మా విధానం" అని అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ సమాజం గందరగోళం, ఘర్షణలతో నిండి ఉందని, ఈ సమయంలో బహుళపాక్షిక విధానాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. చైనా, యూరప్‌లు ప్రత్యర్థులుగా కాకుండా మిత్రులుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు,



డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. "రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగిసే వరకు నాటో కూటమి చైనాపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలి. రష్యాపై చైనాకు బలమైన పట్టు ఉంది. ఈ భారీ సుంకాలు ఆ పట్టును విచ్ఛిన్నం చేస్తాయి. తద్వారా ఈ భయంకరమైన యుద్ధానికి ముగింపు పలకవచ్చు" అని ట్రంప్ పోస్ట్ చేశారు. గతంలో కూడా ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. అమెరికాకు వ్యతిరేకంగా జిన్‌పింగ్ కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. అయితే, ఆసక్తికరంగా, ఈ ఆరోపణలు చేసిన కొన్ని గంటలకే చైనా నాయకత్వంతో తన వ్యక్తిగత సంబంధాలు చాలా బాగున్నాయని చెప్పడం గమనార్హం.

### ఈనెల 17న జరగనున్న విశ్వకర్మ విరాట్ యజ్ఞ మహోత్సవానికి

# విశ్వకర్మలు భారీ సంఖ్యలో తరలి రావాలి

**రంగారెడ్డి జిల్లా విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ) సంఘం అధ్యక్షులు పులిగిళ్ల శ్రీనివాసాచారి**







రాజేంద్రనగర్,సెప్టెంబర్14(నమస్తే ఉదయం) విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలను రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాటేదాన్ శాంతినగర్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ) సంఘం అధ్యక్షులు పులిగిళ్ల శ్రీనివాసాచారి వివరించారు. ఈ మేరకు భక్తులు, విశ్వకర్మ బంధువులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పులిగిళ్ల శ్రీనివాసాచారి మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని అధికారికంగా గుర్తించి సెలవును ప్రకటించిందని,రాష్ట్రప్రభుత్వం సైతం అధికారికంగా సెలవు ప్రకటించాలన్నారు.విరాట్ విశ్వకర్మ సృష్టికర్త అని,అలాంటి సృష్టికర్త మార్గదర్శకత్వంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ జీవితాన్ని గొప్పగా సాగించాలన్నారు.విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 17వ తేదీన ప్రత్యేక పూజా కార్యక్రమాలను సైతం నిర్వహించనున్నట్లు వివరించారు.అందులో భాగంగా ఉదయం 7 గంటలకు విశ్వకర్మ పూజ,విశ్వకర్మ యజ్ఞం,మహాసభ,మహాప్రసాద వితరణ,సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కులబాంధవులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

# పార్టీ కార్యక్రమాలలో ప్రతి కార్యకర్త పాల్గొనాలి

**తోకల శ్రీనివాస్ రెడ్డి**



మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్, సెప్టెంబరు 14 (నమస్తే ఉదయం): మైలార్ దేవుపల్లి డివిజన్ లో ఈ నెల 17 నుంచి చేపట్టనున్న కార్యక్రమాలలో ప్రతి కార్యకర్త పాల్గొనాలని ఆ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మైలార్ దేవుపల్లి బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని బస్తీలలో స్వచ్ఛ భారత్ నిర్వహిం చాలన్నారు. మొక్కలు నాటాలని సూచించారు. ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం, తెలంగాణ విమోచన దినోత్సవాలు, విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలి పారు. సెప్టెంబరు 17న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అదే రోజు జాతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ విమోజన దినోత్సవాలను చేయడం జరుగుతుందన్నారు. సెప్టెం బరు 18న స్వచ్ఛ భారత్, 23న బస్తీ పర్యటనలు, 25న ప్రతి బూత్ లో మొక్కలు నాటే కార్యక్రమాలు, అక్టోబరు 2న గాంధీ జయంతి, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రీలను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ పి.మలేశ్ యాదవ్, నాయకులు జి.పాండు. రావుల భాస్కర్, ఆడికె మహేందర్, నవారు మురళీధర్ రెడ్డి, బబ్లు, ఎన్ను శంకర్ రెడ్డి , పి.సంతుగౌడ్, తలారి చిన్న, మదుసూదన్ రెడ్డి, సీహెచ్ ప్రభుదాస్, రఘునాథ్, ఎండీ షకీల్, రామారావు, శేఖర్, యాదగిరి, బాబురావు, మధుసూదన్, రవి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తీ శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ







మిలాద్ ఉన్ నబి ర్యాలీలో పాల్గొన్న ముస్లిం సోదరులు



బందోబస్తులో పాల్గొన్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, తదితరులు

బుద్వేల్, సెప్టెంబరు 14 (నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఆదివారం ముస్లీం సోదరులు భక్తీ శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వేలాది మం ది ముస్లీం సోదరులు పాల్గొన్నారు. చింతల్ మెట్, ఎం ఎం పహడీ, నౌనెంబర్, కిషన్ బాగ్, పాకీజా హొటల్ తో పాటు అన్ని బస్తీలలో ముస్లీం సోదరులు ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ డీసీపీ కె శ్రీనివాస్, రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ ల ఇన్స్ పెక్టర్ లు నాగేశ్వరరావు, క్యాస్ట్రో, నరేందర్ లు దగ్గరుండి పోలీస్ బందోబస్తులో పాల్గొన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ జాగ్రత్తలు తీసుకున్నారు. ర్యాలీలో నాయకులు గౌస్, తాహేర్, మహ్మద్ మోసిన్, మహ్మద్ చాంద్, మహ్మద్ నజీమ్, ఇస్మాయిల్, షఫీ లతో పాటు పలువురు ముస్లీం మత పెద్దలు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎర్రవెల్లి జగన్ ఎంతో కృషి చేశారు

**తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సైతం అలుపెరుగని పోరాటం చేశారు**

**ఎరవెల్లి జగన్ ని వరించిన శ్రీ మోక్షగుండం విశ్వశేరయ్య ఎక్సెలెన్స్ అవార్డ్ 2025**



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 14 (నమస్తే ఉదయం)జాతీయ ఇంజనీరింగ్ దినోత్సవం సందర్భంగా, సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో సేవలు అందిస్తున్న ప్రముఖ జే ఎన్ టి యు హెచ్ విద్యార్థినేత ఎరవెల్లి జగన్ కు ప్రతిష్టాత్మక శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎక్సెలెన్స్ అవార్డ్ -2025 ను ప్రధానం చేశారు. ఆదివారం ఆక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ హైదరాబాద్ లో నిర్వహించిన ఇంజనీరింగ్ డే దినోత్సవ వేడుకల్లో ఎరవెల్లి జగన్ కు - భారతరత్న, మొట్ట మొదటి భారతదేశం ఇంజనీర్ - శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎక్సెలెన్స్ అవార్డ్-2025 ను అందజేశారు. ఈ సందర్భంగా ఆక్ట్ ఫౌండేషన్ ఛైర్మెన్ మూర్తి మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా ఇంజనీరింగ్ విద్యార్థి నేతగా ఎరవెల్లి జగన్ డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్, స్టూడెంట్ జేఏసీ ను స్థాపించి, డిప్లొమా, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సైతం అలుపెరుగని పోరాటం చేశారని, కరోనా కష్ట కాలంలో దాతల సహాయంతో ఎంతోమందికి నిత్యావసర సరుకులు అందజేశారని అన్నారు. 2016-17 సంవత్సరంలో పూణే లో జరిగిన ఇండియన్ స్టూడెంట్ పార్లమెంట్ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర విద్యార్థి ప్రతినిధిగా హాజరై విద్యార్థుల సమస్యల పట్ల జాతీయ స్థాయిలో మాట్లాడినట్టు తెలిపారు. వీరి సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డా. బిఆర్ అంబేద్కర్ స్మారక ప్రతిభ పురస్కార్ అవార్డ్ ను అందించిందని, హెచ్ఎంటీవీ సైతం విద్యార్థి నేతగా గుర్తించి ఇచ్చిన అవార్డ్, ట్రూ టీచర్స్ కోయలేషన్ రాష్ట్ర ఉత్తమ విద్యార్థి నాయకునిగా అందించిన అవార్డులను గుర్తు చేశారు. నిరంతరం విద్యార్థి నేతగా కళాశాలల్లో, విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎరవెల్లి జగన్ అవార్డులకే వన్నె తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతదేశం లెఫ్టినెంట్ కల్నల్ డా. కమలాకర్, మిసెస్ ఇండియా డా.శోభా, రామ్ దేవరావ్ హాస్పిటల్స్ సిఈవో డా. యోబు తదితరులు పాల్గొన్నారు.



సాయి కృష్ణ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

# సాయిక్రిష్ట కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా బి.శ్రీనివాస్

బుద్వేల్, సెప్టెంబరు 14 (నమస్తే ఉదయం) : బుద్వేల్ సాయి క్రిష్ణ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా బి.శ్రీనివాస్ నియమితులైనారు. ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల సమక్షం లో నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎస్ నాగేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ రమేశ్ యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా కె. అంజయ్య, అనీఫ్, కోశాధికారి గా అశోక్, మహిళా ప్రతినిధిగా వై.ప్రేమీల, సలహాదారులుగా పి.భూపాలెరెడ్డి, ఎస్. రంగస్వామి, కోటేశ్వర్ రావు లు నిమమితులైనారు.

**మాడల్ కాలనీగా అభివృద్ధి చేస్తాం : బిశ్రీనివాస్**

సాయి క్రిష్ణ కాలనీ ని మాడల్ కాలనీ గా అభివృద్ధి చేస్తానని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా నియమితులైన ఓశ్రీనివాస్ అన్నారు. అందరి సహకారం తీసుకుని ముందుకు సాగుతానన్నారు. కమిటీలో యువకులు, మహిళలు, అనుభవజ్ఞులను తీసుకోవడం జరిగిం దన్నారు. పెండింగ్ లో ఉన్న సమస్యలు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, కార్పొరేటర్, వివిధ శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.




**బుద్వేల్, సెప్టెంబరు 14 (నమస్తే ఉదయం) : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం పాతబస్తీ యాకత్ పురా ప్రాంతానికి చెందిన కబీర్ ( 21) తన ఐదు మంది స్నేహితులతో కలిసి షిఫ్ట్ కారులో యాకుత్ పురా నుండి శంషాబాద్ వైపు అర్ధరాత్రి వెళ్లారు. అనంతరం ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల 40 నిమిషాల ప్రాంతంలో తిరుగు ప్రయాణమయ్యారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారానికి కొంత దూరంలో ఉన్న డివైడర్ ను వేగంగా వచ్చి ఢీకొట్టారు. ఈ సంఘటనల్లో కబీర్ తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడ్డ మరో ఐదుగురిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.**

# మద్యం మత్తులో హాస్టల్‌లోకి చొరబడి తలుపులు పగలగొట్టి, అద్దాలను ధ్వంసం చేసి విద్యార్థులపై దాడి

**తీవ్ర ఆందోళనతో భయభ్రాంతులకు గురైన విద్యార్థులు**

**కేపీహెచ్‌బీ హాస్టల్‌పై బీఆర్ఎస్ ఆకతాయిల దాడిని ఖండించిన కాంగ్రెస్ యువ నాయకుడు శివ చౌదరి**

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 14 (నమస్తే ఉదయం)కూకట్ పల్లి కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నంబర్ 3లోని ఓ హాస్టల్‌పై శనివారం అర్థరాత్రి బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగానికి చెందిన ఆకతాయిలు దాడి చేసిన ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈ దాడిని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శివ చౌదరి ఘాటుగా ఖండించారు. బాలాజీనగర్ డివిజన్ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అలియాస్ అన్నవరం అండ్ గ్యాంగ్ మద్యం మత్తులో హాస్టల్‌లోకి చొరబడి తలుపులు పగలగొట్టి, అద్దాలను ధ్వంసం చేస్తూ విద్యార్థులపై దాడి చేశారు. ఈ దౌర్జన్యంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికుల ద్వారా ఈ సంఘటన ను తెలుసుకున్న శివ చౌదరి ఆదివారం హాస్టల్‌ను సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాన్ని చేతిలోకి తీసుకొని హాస్టల్లోకి చొరబడి దాడులు చేయడం అనాగరికం అన్నారు. తలుపులు, అద్దాలను ధ్వంసం చేయడం విద్యార్థుల భద్రతకు ముప్పు అని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో రాత్రివేళ బయటకు రావడానికి కూడా భయం వేస్తోందని, బైకులపై తిరుగుతూ అమ్మాయిలపై అసభ్యకర ప్రవర్తన చేస్తున్నారని, మద్యం మత్తులో దౌర్జన్యంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు ఆయనకు తెలిపారు. జరిగిన సంఘటనలపై కార్పొరేటర్లపై ఆయన పలు ప్రశ్నలు వేశారు. బాలాజీనగర్, కేపీహెచ్‌బీ కార్పొరేటర్లు ఈ ఘటనలపై ఎందుకు స్పందించడం లేదు? తమ పరిధిలోనే విద్యార్థులు, యువతులపై దాడులు జరిగినా మౌనంగా ఎందుకు కూర్చున్నారు ? అని శివ చౌదరి ప్రశ్నించారు. అంతేకాకుండా దాడి విషయాలను టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు శివ చౌదరి తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల భద్రత కోసం కృషి చేసే నాయకుడు బండి రమేష్ అని అన్నారు. ఇలాంటి ఆకతాయి దాడులను అసలు ఉపేక్షించరన్నారు. కాంగ్రెస్ ఎల్లప్పుడూ బాధితుల పక్షాన నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఆకతాయిల దౌర్జన్యాన్ని కాంగ్రెస్ ఎప్పటికీ సహించదని, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. “RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733